సాక్షి ప్రకాశం

సోమవారం। 28। జూలై। 2025



అమృత్ భారత్..నత్తనడక

అమృత్ భారత్ పథకం కింద ఎంపికైన కంభం రైల్వే స్టేషన్‌లో రూ.11 కోట్లతో మూడేళ్ల క్రితం చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. - 8లో..



స్మార్ట్ మీటర్లతో పెనుభారం

స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెనుభారం మోపుతున్నాయని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

మద్యం పేరుతో అక్రమ కేసులు తగదు



తొర్రగుడిపాడులో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్: మద్యంలో ఎలాంటి స్కాం లేదని తెలిసినా కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా ఎంపీ మిథున్‌రెడ్డి పై, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెట్టడం, అరెస్టులు చేయించడం తగదని మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున అన్నారు. మండలంలోని తొర్రగుడిపాడులో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడం, అరెస్టు చేయడం పరిపాటిగా మారిందన్నారు. ఇటీవల మంత్రి పర్యటనలో డోలా బాలవీరాంజనేయస్వామి బూచేపల్లి కుటుంబంపై రాజకీయ విమర్శలు చేయడం తగదని, జిల్లాలో అవినీతి మరక అంటని కుటుంబం బూచేపల్లి కుటుంబం అని అన్నారు. పైసా ఆశించకుండా పార్టీలకు అతీతంగా ప్రజలకు సహాయం చేసే కుటుంబం బూచేపల్లిది అన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్‌బాబు, మాజీ వైస్ ఎంపీపీ రామసాని సూర్యం, మండల రైతు అధ్యక్షుడు నల్లూరి చంద్ర, కౌన్సిలర్ మేకల సులోచన ఎల్లయ్య, దాసరి లక్ష్మీనారాయణ, కత్తి రమణారెడ్డి, డాక్టర్ బొడ్డపాటి హరిబాబు, పులి శ్రీను, కొనికి సుబ్రహ్మణ్యం, కృష్ణమూర్తి, దేవుడు తదితరులు ఉన్నారు.

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబు

ఒంగోలు సిటీ: వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలు సీఐటీయూ జిల్లా కార్యాలయంలో యునైటెడ్ మెడికల్-హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వై.సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో తాళ్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తొలగించిన మగ ఆరోగ్య కార్యకర్తలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రీడిప్లాయిమెంట్ విధానం వలన మహిళా ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని రద్దుచేసి ఎక్కడ వేతనాలు పొందుతున్నారో అక్కడే విధులు నిర్వహించేలా చూడాలని కోరారు. ఆన్‌లైన్ వర్క్ యాప్స్ సంఖ్య తగ్గించి పనిభారం తగ్గించాలని, పీఆర్సీ, ఐ.ఆర్ ఇవ్వాలని కోరారు. సీపీఎస్ విధానం రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీధరబాబు మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ని నియమించాలని, గ్రామ, వార్డ్ హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకు రావాలని, వైద్య ఆరోగ్య శాఖ విధులు మాత్రమే చేయించాలని కోరారు. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులంతా యూనియన్‌లో సభ్యత్వం తీసుకొని తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహించే సీఐటీయూ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్.ఎల్.హెచ్.పి సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు బెజవాడ వెంకటేష్, ఎం.నాయక్, పి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

మొలకెత్తని ఆశలు

జిల్లాలో ఖరీఫ్ సాగు నత్తనడకన సాగుతోంది. ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటడంతో సాగు ముందుకు సాగడం లేదు. సాధారణంగా ఖరీఫ్‌లో ఈ పాటికి జిల్లాలో కనీసం 30 శాతానికిపైగా పంటలు సాగుకావాల్సి ఉండగా ఈ ఏడాది పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పంటల సాగు 8 శాతం మాత్రమే కాగా.. విత్తిన పొలాల్లోనూ మొలకలు రాక రైతులు నష్టపోతున్నారు. మరో వైపు గిట్టుబాటు ధరలు దక్కుతాయో లేదోనని మిర్చి సాగు చేయాలంటేనే రైతులు భయపడుతున్నారు.

- ఖరీఫ్ సాగు అరకొర
- ఆశించిన వర్షాలు లేక బీళ్లుగా పొలాలు
- ఇప్పటికి 8 శాతం మాత్రమే పంటల సాగు
- విత్తిన పొలాల్లోనూ మొలకలు రాక నష్టం
- మిర్చి వైపు చూడని రైతులు



జిల్లాలో ఖరీఫ్ సాగు లక్ష్యం **1,29,102 హెక్టార్లు**

సాగైంది **10,468 హెక్టార్లు**

జిల్లాలో సాగు ఇలా...

పంట పేరు	సాగైన విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	249
జొన్న	34
సజ్జ	612
మొక్కజొన్న	1683
కొర్రలు	235
పెసలు	58
మినుములు	121
కందులు	117
వేరుశనగ	90
నువ్వులు	1954
పొద్దుతిరుగుడు	2
ఆముదం	585
పత్తి	4679
సోయాబీన్	49

మార్కాపురం: జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, పొలాలు పదునెక్కక వ్యవసాయం ముందుకు సాగడం లేదు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పడుతున్న వర్షపు జల్లులు తేమ శాతాన్ని పెంచుతున్నాయే తప్ప పంటలు సాగు చేసుకునేందుకు ఉపయోగపడటం లేదు. రుతుపవనాలు సకాలంలో వచ్చి వర్షాలు పడతాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటిస్తున్నా ఆకాశంలో మబ్బుల జాడ తప్ప వర్షపు చినుకు పొలంలో పడటం లేదు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 1,29,102 హెక్టార్లలో పంటలు సాగు కావాల్సి ఉండగా ఇప్పటికి కేవలం 10,468 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. అంటే 8.11 శాతమే పంటలు సాగైనట్లు అంచనా.

పశ్చిమ ప్రకాశంలో కరువు పరిస్థితి ఇలా...

పశ్చిమ ప్రకాశంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. సాధారణ వర్షపాతం కూడా పలు మండలాల్లో నమోదు కాలేదు. ఎండిపోయిన చెరువులు, బీడు భూములు కనిపిస్తున్నాయి. సాధారణంగా ఖరీఫ్‌లో రైతులు సజ్జ, కంది, ఆముదం, పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తారు. ఇటీవల కురిసిన వర్షానికి కొంత మంది రైతులు పొలాలు సిద్ధం చేసుకుంటున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆలస్యంగా నాట్లు వేస్తే తెగుళ్లు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి రోజు వర్షం కోసం రైతులు ఎదురు చూడటమే సరిపోతోంది. కొన్ని చోట్ల పత్తి, కంది, సజ్జ, జొన్న పైర్లు వేసినా మొలకలు రాలేదు. కొన్నిచోట్ల విత్తనాలు నాటిన తరువాత వర్షం కురవడంతో పొలంపై ఉన్న మట్టి అట్టలాగా మారి మొలకలు తక్కువగా వచ్చాయి.

పడిపోయిన మిర్చి సాగు:

ఈ ఏడాది మిర్చిసాగు గణనీయంగా తగ్గే అవకాశాలున్నాయి. గతేడాది గిట్టుబాటు ధరలేక పెట్టుబడుల డబ్బులు రాక మిర్చి రైతులు అవస్థలు పడుతున్నారు. నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మిర్చి రైతులకు ఎర్ర బంగారం కాగా నేడు భారంగా మారింది. 2021–22, 2022–23 సంవత్సరాల్లో క్వింటా మిర్చి ధర రూ.25 వేల నుంచి రూ.30 వేల మధ్య పలికింది. గతేడాది నుంచి ధరలు తగ్గుతూ వచ్చాయి. గతేడాది నవంబరులో రూ.15 నుంచి రూ.16 వేలు ఉన్న ధర ఫిబ్రవరి నాటికి రూ.11 వేలకు కూడా పలకలేదు. దీంతో ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లడంతో ప్రభుత్వం కొనుగోళ్లపై దృష్టి పెట్టింది. అయినా నష్టాలే మిగిలాయి. ఎకరా మిర్చిసాగుకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.25 లక్షల వరకూ ఖర్చు వస్తోంది. గతేడాది మిర్చికి తెగుళ్ల ఆశించడంతో అటు దిగుబడి తగ్గిపోయి, ఇటు గిట్టుబాటు ధరలేక తీవ్రంగా నష్టపోయారు. దీంతో ఈ ఏడాది మిర్చి సాగు చేయాలంటేనే రైతులు భయపడుతున్నారు. జిల్లా మొత్తం మీద ఈ సీజన్‌లో వెయ్యి ఎకరాలకు మించి సాగు కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

వర్షం కోసం ఎదురుచూపులు



జూలై మూడో వారానికైనా వర్షం పడుతుందని ఎదురుచూశాం. చిరు జల్లులు తప్ప పంటలు వేసుకునేందుకు అనుకూలమైన వర్షాలు లేవు. మార్కాపురం ప్రాంతమంతా వర్షాధారంపైనే రైతులందరం పంటలు సాగు చేసుకుంటున్నాం. పదును వాన కురిస్తే విత్తనాలు చల్లుకుంటాం. అడపా దడపా కురుస్తున్న వర్షాల వలన రైతులకు ఎటువంటి ఉపయోగం లేదు.

– లక్ష్మిరెడ్డి, రైతు, వేములకోట

మిర్చి సాగు చేయాలంటే భయంగా ఉంది



పోయిన ఏడాది మిర్చి సాగు చేశాను. గిట్టుబాటు ధర రాలేదు. దాంతో పాటు అకాల వర్షాలతో తెగుళ్లు వచ్చి దిగుబడులు కూడా తగ్గిపోయాయి. దీంతో ఈ ఏడాది మిర్చి సాగు చేయాలంటేనే భయంగా ఉంది. ఈ ఏడాది ఇంత వరకు వర్షాలు లేవు. జూలై నెలాఖరైనా పొలాల్లో విత్తనాలు చల్లలేదు. ఆలస్యంగా పంటలు సాగు చేస్తే అనుకోని తెగుళ్లు వస్తాయి. వ్యవసాయం చేయాలంటేనే భయంగా ఉంది. వర్షం పడితే పత్తి, సజ్జ వేద్దామనుకుంటున్నా.

– వెంకటేశ్వరరెడ్డి, మేకలవారిపల్లి



మొలకెత్తని పత్తిపొలం



చుక్కనీరు లేని వేములకోట చెరువు

హామీలు నెరవేర్చని ప్రభుత్వాన్ని సాగనంపుదాం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పక్కన చుండూరి రవిబాబు, వేదికపై బత్తుల, జూపూడి, కాకుమాని తదితరులు

- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

కొత్తపట్నం: హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వాన్ని సాగనంపడానికి రోజులు దగ్గరపడ్డాయని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. మండలంలోని నల్లూరి గార్డెన్ పక్కనే ఉన్న స్థలంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముందుగా ఈతముక్కల నుంచి కొత్తపట్నం సభా కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. బస్టాండ్ సెంటర్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రతిసారీ మోసపూరిత మాటలు చెప్పి ఓట్లు వేయించుకుని మోసం చేస్తున్నాడని, ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకే బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం చేపట్టామన్నారు. తల్లికి వందనం, ఏడాదికి మూడు సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలు ఇస్తామని చెప్పి మోసం చేశారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినవన్నీ నెరవేర్చారని అన్నారు. ఈ పథకాలు మళ్లీ అమలు కావాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకోవాలని కోరారు. పొగాకు రైతులను పరామర్శించడానికి వైఎస్ జగన్ వస్తే ఆయన్ను చూసేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కేసులు పెట్టించడం సిగ్గుచేటన్నారు. ప్రజలకు మేలు జరిగేలా పథకాలు అమలు చేయాలి కానీ రెడ్‌బుక్ పేరుతో అక్రమ కేసులు పెట్టడం తగదన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ పోరాటం చేసి పోలీసులను కూడా లెక్క చేయకుండా సభా ప్రాంగణానికి చేరుకున్న కార్యకర్తలకు ఎంత అభిమానం ఉందో తెలుస్తోందన్నారు. చంద్రబాబు నాయుడు సింగపూర్ వెళ్తుంటే నాలుగు రోజులు పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రిగా చేస్తాడటని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిపాలన టీడీపీకి అప్పగించడం, పవన్ కల్యాణ్ నెలవారీ మామూళ్లు తీసుకోవడం చూస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మీటింగ్ పెడితే గజగజలాడుతున్నారని తెలిపారు.

వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఉచిత వైద్యం, ఉచిత విద్యుత్ అందించిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 99 శాతం సంక్షేమ పథకాలు అమలుచేసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు.

వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను గుర్తుచేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గతంలో అందుకున్న పథకాలన్నీ మళ్లీ పొందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. పార్టీ కార్యక్రమాలను అడుగడుగునా పోలీసులు అడ్డుకుంటున్నారని, కార్యకర్తలు కలసికట్టుగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు.

మాజీ పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మాదాసి వెంకయ్య మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై పోలీసు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని, తాము అండగా ఉంటామని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ దమ్మున్న మగాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అక్రమ కేసులు పెడితే వెనుకకు తగ్గేదే లేదన్నారు. ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకుందని, మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, వ్యవసాయ విభాగం జోనల్ అధ్యక్షుడు అళ్ల రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సైకలం లక్ష్మీశారద, మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి, బొట్ల సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు మిట్నసల కాంతారావు, మన్నె శ్రీనివాసరావు, వాయల సుమతి, నగరగంటి శ్రీనవాసరావు, పిచ్చిరెడ్డి, యేలు వెంకటేశ్వరరావు, మన్నె శ్రీధర్, ఓబుల్‌రెడ్డి, రమాదేవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన కార్యకర్తల్లో ఓ భాగం

పచ్చ నాయకుడి భూ దాహం

- ప్రభుత్వ స్థలం తనదంటూ టీడీపీ నాయకుడి దౌర్జన్యం
- ఒంగోలు రూరల్ మండలం చింతాయగారిపాలెంలో ఆక్రమించుకోవడానికి యత్నాలు
- ఇప్పటికే ఆ స్థలంలో సచివాలయం, రైతు సేవా కేంద్రం, హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులు
- గతంలో కోర్టులో ఉన్న కేసు వెనక్కి
- అధికారం రావడంతో ఆ స్థలం తనదంటూ మళ్లీ గ్రామస్తులకు బెదిరింపులు



గతంలో ఆ ప్రాంతంలో ఉన్న నీటి కుంట (ఫైల్)

నాగులుప్పలపాడు: అధికారం అండతో ఏడాది నుంచి కూటమి నేతల అకృత్యాలు రోజు రోజుకీ ఎక్కువైపోతున్నాయి. అడిగేవారు లేరని అందినకాడికి దోచుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ఇసుక, మద్యం, గ్రావెల్, బియ్యం ఇలా ఒకటేమిటి అందినకాడికి దోచుకుంటూ రెండు చేతులా సంపాదించుకుంటున్నారు. తాజాగా ఒంగోలు రూరల్ మండలం చింతాయగారిపాలెం గ్రామంలోని ప్రభుత్వ భూమిపై ఒక టీడీపీ నాయకుడి కన్నుపడింది. అంతే లక్షల రూపాయల విలువ చేసే స్థలాన్ని కబ్జా చేయడానికి పూనుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే ఒంగోలు రూరల్ మండలం చింతాయగారిపాలెం సర్వే నంబరు 409/1 లో 75 సెంట్ల స్థలం ఉంది. ఈ స్థలంలో గత ప్రభుత్వం గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలకు పూనుకుంది. సదరు స్థలం లోతట్టుగా ఉండటంతో అప్పట్లోనే దానిని కొంత మేరకు పూడ్చి, చదును చేయడానికి ప్రభుత్వం రూ.6 లక్షలు మంజూరు చేసింది. పూడిక, చదును చేసే పనులు పూర్తయిన తరువాత ఆ స్థలంలో 2020లో సచివాలయ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సచివాలయ భవన నిర్మాణం మొదలుపెట్టిన క్రమంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు చాపల శ్రీనుతో పాటు మరికొంత మంది కలిసి ఆ భూమి తమదంటూ కోర్టుకు వెళ్లారు. అంతలోనే 2023 లో మళ్లీ ఆ భూమి తమది కాదని కోర్టులో వేసిన కేసును టీడీపీ నాయకులే తిరిగి వాపసు తీసుకున్నారు. అధికారులు కూడా పరిశీలించి ఈ భూమి టీడీపీ నాయకులది కాదని చెప్పడంతో మిన్నకుండిపోయాడు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ టీడీపీ నాయకుడు రెచ్చిపోయి ప్రభుత్వ భవనాల నిర్మాణం జరుగుతున్న ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించడమే కాకుండా ఆ స్థలంలోకి ఎవరినీ రానీయకుండా దౌర్జన్యం చేస్తూ బెదిరింపులకు గురిచేస్తున్నాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. ఈ సమస్యపై ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమార్కుల చెరలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని విడిపించి గ్రామ సచివాలయం, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు సహకారం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై వీఆర్వో రామకృష్ణను వివరణ కోరగా ఆ స్థలానికి సంబంధించి గతంలో ఇద్దరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించారని, వారిలో ఒకతను కేసును వెనక్కి తీసుకున్నారని మరొక వ్యక్తి కేసు పెండింగ్ లోనే ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలంలోకి ఎవరినీ అనుమతించేది లేదని తెలిపారు.

ఆక్రమణలు తొలగించి గ్రామాభివృద్ధికి తోడ్పడాలి



గ్రామంలో ప్రజల సౌలభ్యం కోసం సచివాలయం, మిగతా ప్రభుత్వ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే వాటిని నిర్మించుకోకపోవడం వలన అభివృద్ధికి దూరంగా ఉన్నాం. ప్రభుత్వ స్థలం ఆక్రమణలకు పాల్పడిన వ్యక్తులు ఇప్పటికైనా కోర్టు నిబంధనలకు లోబడి ఆక్రమణలు వదిలేసి గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించి కలసి రావాలి.

– నాయుడు శ్రీరాములు, సర్పంచ్, చింతాయగారిపాలెం



నిర్మాణ దశలో ఆగిపోయిన గ్రామ సచివాలయం



ఆక్రమణదారులు తొలగిస్తున్న చిల్లచెట్లు

ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అబ్దుల్ కలాంకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, నాయకులు

యర్రగొండపాలెం: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంకు ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో కలాం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఉపాధ్యక్షుడు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.అరుణాబాయి, నియోజకవర్గ బూత్‌కమిటీ అధ్యక్షుడు ఒంగోలు సుబ్బారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లె సరళ, యాక్టివిటీ కార్యదర్శి ఎస్.ప్రసాద్, ముస్లిం విభాగం నాయకుడు సయ్యద్ జబీవుల్లా, ఆర్యవైశ్య సంఘం నాయకులు పబ్బిశెట్టి శ్రీనివాసులు, కందూరి కాశీ విశ్వనాథ్, సూరె శ్రీనివాసులు, దోగిపర్తి సంతోష్‌కుమార్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, సర్పంచ్‌లు ఆవుల కోటిరెడ్డి, కె.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.రంగబాబు, ఆవుల రమణారెడ్డి, పి.సత్యనారాయణరెడ్డి, ఎల్లారెడ్డి రోషిరెడ్డి, బి.బాల చెన్నయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయ విధానం భేష్

- జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించిన కేరళ బృందం
- ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన



పాదర్తిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న కేరళ బృందం

ఒంగోలు సబర్బన్: ప్రకృతి వ్యవసాయ విధానాలపై లోతైన అవగాహన, శిక్షణ కోసం కేరళ నుంచి వచ్చిన 34 మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి బృందం జిల్లాలో ఆదివారం పర్యటించింది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను బృందం సందర్శించింది. ప్రకృతి వ్యవసాయం జిల్లా డీపీఎం వి.సుభాషిణి నేతృత్వంలో కేరళ బృందం తొలుత మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన రైతు రామాంజనేయులు పొలాన్ని పరిశీలించారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో 20 రకాల పంటల వైవిధ్యంతో సాగు చేస్తున్న విధానాలను వారు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. కొత్తపట్నం మండలం పాదర్తిలో రైతు మస్తాన్ సాగు చేస్తున్న ఏ-గ్రేడ్ వేరుశనగ పంటను కేరళ బృందం వీక్షించింది. మస్తాన్ అనుసరిస్తున్న అంతర పంటలు, సరిహద్దు పంటల ప్రయోజనాలను బృందం తెలుసుకుంది. కొత్తపట్నానికి చెందిన మల్లేశ్వరి బయో-రిసోర్స్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ ఘన జీవామృతం తయారీ ప్రక్రియ, విత్తనశుద్ధి చర్యలపై ప్రాక్టికల్ డెమోను ప్రత్యక్షంగా చూశారు. కేరళ బృందంతో పాటు రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డీవీ రాయుడు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



అటవీ ప్రాంతంలో పడి ఉన్న మృతదేహం

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు నవోదయ కళాశాల ఎదురుగా అటవీ ప్రాంతంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. మృతదేహాన్ని గమనించిన పశువుల కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు రాగసముద్రానికి చెందిన బి.విష్ణుగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆర్టీసీ బస్సుల్లో చోరీలు చేసే వ్యక్తి అరెస్టు

- 10 ల్యాప్‌టాప్‌లు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన వన్‌టౌన్ సీఐ నాగరాజు



స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, నిందితుని వివరాలు వెల్లడిస్తున్న సీఐ

ఒంగోలు సిటీ: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల బ్యాగ్‌లు చోరీ చేసే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. నిందితుడు కందుకూరుకు చెందిన విసా రమేష్‌బాబును ఒంగోలు భాగ్యనగర్ వద్ద అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 ల్యాప్‌టాప్‌లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.2,50,000 ఉంటుందని తెలిపారు. ఒంగోలు వన్‌టౌన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో సీఐ నాగరాజు వివరాలు వెల్లడించారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల్లో ప్రయాణించేవారు తమ వెంట తీసుకువెళ్లిన బ్యాగ్‌లను బస్సులో పెట్టి ఆర్టీసీ బస్టాండ్‌లో టిఫిన్‌కి లేదా భోజనం నిమిత్తం దిగేవారిని గమనించి నిందితుడు చోరీకి పాల్పడేవాడు. కందుకూరుకు చెందిన వీసా రమేష్‌బాబు ప్రయాణికుడిలా బస్సు ఎక్కినట్లు నటించి ప్రయాణికులు సీట్లో లేకుండా బ్యాగులు మాత్రమే సీట్లు ఉన్న చోట కూర్చొని అతని దగ్గర ఉన్న ఖాళీ బ్యాగ్ పెట్టి చాకచక్యంగా వారి బ్యాగ్ దొంగిలించేవాడని తెలిపారు. గత రెండేళ్లుగా ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 5న సుధాకర్ అనే వ్యక్తి విజయవాడ నుంచి తిరుపతి వెళుతూ ఒంగోలు బస్టాండ్‌లో మంచినీళ్ల బాటిల్ కోసం దిగాడు. నిందితుడు వీసా రమేష్‌బాబు..సుధాకర్ బ్యాగ్‌ను తీసి అందులోని రూ.5 వేల నగదు, విలువైన పత్రాలు అపహరించాడు. సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ఆర్టీసీ బస్టాండ్‌లోని సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించారు. నిందితుడు ఆదివారం ఒంగోలు భాగ్యనగర్ వద్ద ఉండగా అరెస్టు చేసి అతని వద్ద మొత్తం 10 ల్యాప్‌టాప్‌లు, రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రతిభ కనపరిచిన టుటౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు టుటౌన్ ఎస్సై సువర్ణ, ఓ.సురేష్, ఏఎస్సై సాయి, సిబ్బంది విజయ్, కానిస్టేబుళ్లు అనిల్‌ను ఎస్పీ అభినందించారు.



మొదటి ప్లాట్‌ఫాంపై మధ్యలో జరుగుతున్న పనులు



ప్లాట్‌ఫాంపై తాగిపడేసిన మద్యం సీసాలు



స్టేషన్ ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులు



కొత్తగా ఏర్పాటు చేయగా మొరాయిస్తున్న లిఫ్ట్

అమృత్ భారత్.. నత్తనడక.!

కంభం రైల్వేస్టేషన్

అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం

- అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్‌కు రూ.11 కోట్లు మంజూరు
- పనులు ప్రారంభమై మూడేళ్లు కావస్తున్నా పూర్తి కాని వైనం
- ఆలస్యంపై రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినా ఫలితం శూన్యం
- పనులు పూర్తయితే ప్రయాణికులకు అనేక సౌకర్యాలు
- త్వరితగతిన పూర్తిచేయాలంటున్న ప్రజలు





పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం (ఫైల్ ఫొటో)

కంభం:

అమృత్ భారత్ పథకం కంభం రైల్వేస్టేషన్‌లో నత్తనడక నడుస్తోంది. ఈ పథకం కింద ఎంపికైన కంభం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.11 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో సుమారు 3 సంవత్సరాల క్రితం చేపట్టిన అభివృద్ధి పనులు నేటికీ పూర్తి కాలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంభం రైల్వేస్టేషన్‌కు చుట్టుపక్కల మండలాల నుంచి నిత్యం వందలాదిమంది ప్రయాణికులు వస్తుంటారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఆర్మీలో పనిచేసే వారు అధికంగా ఉండటంతో వారంతా కుటుంబాలతో కలిసి రైళ్లలోనే వెళ్తుంటారు. అందుకోసం కంభం రైల్వేస్టేషన్‌నే ఆశ్రయిస్తుంటారు. రాత్రి సమయాల్లో రైళ్ల కోసం వేచి చూస్తుంటారు. నిత్యం వందలాదిమంది ప్రయాణించే కంభం రైల్వేస్టేషన్‌లో అరకొర సౌకర్యాలతో ప్రయాణికులు అవస్థపడుతున్నారు.

అరకొరగానే అభివృద్ధి పనులు...

అమృత్ భారత్ పథకంలో మూడు సంవత్సరాల క్రితం కంభం రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులన్నీ నేటికీ అరకొరగానే జరిగాయి. అదనపు గదుల నిర్మాణం, వెయిటింగ్ హాలుకు మరమ్మతులు, ప్లాట్‌ఫాంల పెంపు, గ్రానైట్, టైల్స్ ఏర్పాటు, రైల్వేస్టేషన్ ముఖద్వారం ఆధునికీకరణ, ప్రాంగణం చుట్టూ ప్రహరీ, పార్కింగ్ టైల్స్ వంటి పనులు చేపట్టారు. మొదటి ప్లాట్‌ఫాం నుంచి రెండో ప్లాట్‌ఫాంకు వెళ్లేందుకు లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో లిఫ్ట్ నిర్మాణం పూర్తవగా, మిగిలిన పనులన్నీ నిర్మాణ దశలోనే ఉన్నాయి. అభివృద్ధి పనులన్నీ పూర్తయితేనే కంభం రైల్వేస్టేషన్ రూపురేఖలు మారి ప్రయాణికులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుతాయని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అన్ని రైళ్లు ఆగేలా చూడాలి...

కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట, కనిగిరి మండలాల నుంచి ప్రయాణికులు, ఆర్మీ ఉద్యోగులు కంభం రైల్వేస్టేషన్ నుంచే సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న కనిగిరి పట్టణం నుంచి రాత్రివేళ కంభం రైల్వేస్టేషన్‌కు బస్సు సౌకర్యం కూడా ఉందంటే.. కంభం రైల్వేస్టేషన్‌కు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. కంభంలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగుతుండగా, గరీబ్ రథ్, పూరీ-యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ధర్మవరం ఎక్స్‌ప్రెస్, ఇంకా కొన్ని వీక్లీ ట్రైన్స్ ఆపకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లే ఆర్మీ ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి అన్నిరకాల రైళ్లు కంభం రైల్వేస్టేషన్‌లో ఆగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పనుల్లో జాప్యంపై ఉన్నతాధికారులు ఆగ్రహం...

అభివృద్ధి పనుల్లో జరుగుతున్న జాప్యంపై రైల్వే ఉన్నతాధికారులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేష్ణాసేన్ శనివారం కంభం రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసి అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతి లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గతంలోనూ ఉన్నతాధికారులు ఆగ్రహించినా అభివృద్ధి పనులు మాత్రం వేగం పుంజుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

తరచూ మొరాయిస్తున్న లిఫ్ట్‌తో ప్రయాణికులకు ఇబ్బందులు...



లిఫ్ట్ పనిచేయకపోవడంతో పట్టాలపై నుంచి రెండో ప్లాట్‌ఫాంపైకి వెళ్తున్న ప్రయాణికులు

నూతనంగా ప్రారంభించిన లిఫ్ట్ తరచూ మొరాయిస్తుంది. దీంతో ప్రయాణికులు రైలు వచ్చేస్తుందన్న తొందర్లో పట్టాలు దాటుకుని రెండో ప్లాట్‌ఫాంపైకి వెళ్తున్నారు. రెండో ప్లాట్‌ఫాంలో నీటి సమస్య ఉందని ప్రయాణికులు చెబుతున్నారు. ఆర్వోప్లాంట్ వినియోగంలో లేకపోవడంతో పాటు వెయిటింగ్ హాలు లేకపోవడం, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రిజర్వేషన్ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫాంపై ఇంకా పార్కింగ్ టైల్స్, గ్రానైట్ పరచలేదు. స్టేషన్ ఆవరణలోని పనులన్నీ అసంపూర్తిగా ఉన్నాయి. రాత్రివేళ ప్లాట్‌ఫాంలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. అక్కడే మద్యం సేవించి ఖాళీ బాటిల్స్, గ్లాసులను పరిసరాల్లో పడేస్తుండటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు.

పార్శిల్ సర్వీసులు పునరుద్ధరించాలి...

సుమారు 50 ఏళ్లుగా కంభం రైల్వేస్టేషన్‌లో అందుబాటులో ఉన్న పార్శిల్ సర్వీసులను ఇటీవల నిలిపివేయడంతో వ్యాపారులు, ప్రజలు, ఆర్మీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాదు, గుంటూరు, విజయవాడ, బెంగళూరు వంటి దూర ప్రాంతాలకు ద్విచక్రవాహనాలు, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు పంపించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిలిపివేసిన పార్శిల్ సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని చుట్టుపక్కల మండలాల ప్రజలు కోరుతున్నారు.



ఆర్వోప్లాంట్‌కు తాళం వేసి ఉన్న దృశ్యం



వెయిటింగ్ హాలుకు పూర్తికాని మరమ్మతులు

పనులు త్వరగా పూర్తి చేయాలి :



కంభం రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేస్తే ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. పనులు అసంపూర్తిగా ఉండటంతో రాత్రి వేళల్లో దూర ప్రాంతాలకు కుటుంబంతో కలిసి వెళ్లేందుకు రైల్వేస్టేషన్ వచ్చిన ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

షేక్ కరీంబాషా, కంభం

అన్నిరకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి :



కంభం రైల్వేస్టేషన్‌లో అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చూడాలి. పుణ్యక్షేత్రాలకు, దూర ప్రాంతాలకు వెళ్లే వారు కంభంలో స్పెషల్ ట్రైన్స్ ఆగకపోవడంతో నంద్యాల, మార్కాపురం వెళ్లాల్సి వస్తోంది. అధికారులు స్పందించి రద్దీగా ఉండే కంభం రైల్వే స్టేషన్‌లో అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలి.

ఎం.రాము, ప్రయాణికుడు

స్మార్ట్ మీటర్లతో పెనుభారం



గాంధీ నగర్‌లోని స్మార్ట్ మీటర్ల గోడౌన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు

- ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికీ అవగాహన
- గాంధీనగర్‌లోని స్మార్ట్ మీటర్ల గోడౌన్ వద్ద నిరసన

ఒంగోలు సబర్బన్: విద్యుత్ వినియోగదారులపై పెనుభారం మోపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా రెండో రోజు ఒంగోలు నగరంలోని గాంధీజెగర్, జెడ్పీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, శివప్రసాదు కాలనీ, కొత్తడొంక, మిలటరీ కాలనీ, యానాది సంఘం, వడ్డిగుంట కాలనీల్లో ఆదివారం ఐక్యవేదిక నాయకులు ఇంటింటికీ తిరిగి స్మార్ట్ మీటర్ల వల్ల భవిష్యత్‌లో జరిగే అనర్థాలను వివరించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఆదేశంతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం కార్యక్రమంలో భాగంగా అదానీ కంపెనీకి స్మార్ట్ మీటర్లు బిగింపు కోసం అనుమతి ఇచ్చారన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక కమిటీ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు బిగించవద్దు అంటూ ఇంటింటికీ తిరిగి నినాదాలు చేస్తున్నారు. గాంధీనగర్‌లోని స్మార్ట్ మీటర్లు గోడౌన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు రాంబాబు, ఏఐటీయూసీ నాయకుడు కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లను పగలకొట్టండి వారిపై కేసులు పెట్టండి మేము మీకు మద్దతుగా ఉంటామని లోకేష్ చెప్పి ఇప్పుడు అధికారంలోకి రాగానే అవన్నీ మరిచిపోయారాఅని ప్రశ్నిస్తున్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును ఆపకుంటే భవిష్యత్‌లో ప్రజలను కలుపుకొని పోరాటాలను చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, ఐఎఫ్‌టీయూ నాయకులు రాజశేఖర్, ఎం.ఎస్.సాయి, సీఐటీయూ ఒంగోలు నగర కార్యదర్శి మహేష్, దామా శ్రీనివాసులు, సీహెచ్ చిరంజీవి, తంబి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

యర్రగొండపాలెం: సకుటుంబ సమేతంగా మిత్రులంతా ఒకచోట చేరి సందడి చేశారు. అలనాటి జ్ఞాపకాలను ఒకరికొకరు చెప్పుకొని ఆనందపడ్డారు. నాటి జ్ఞాపకాలను నెమరుకొని మనసారా నవ్వుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1976-78 నుంచి 1980-82వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఎంతో ఉత్సాహంగా సాగింది. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్నవారు, ఉద్యోగ విరమణ చేసినవారు 120 మంది పూర్వ విద్యార్థులు, వారి కుటుంబాలు కలిసి ముచ్చటించుకున్నారు. ఈ సందర్భంగా పూర్తిగా వెనకబడిన యర్రగొండపాలెంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన సమితి ప్రెసిడెంట్ దివంగత వేగినాటి కోటయ్య సతీమణి కాశమ్మను వారంతా ఘనంగా సన్మానించారు.

జూనియర్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల జట్టు

కందుకూరు రూరల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల, బాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికలు కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం ఆదివారం నిర్వహించారు. జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 30 మంది బాలుర, 25 మంది బాలికలు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన 12 మంది బాలుర, 12 మంది బాలికలను జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు వచ్చే నెల 14 నుంచి 17వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా పీఠాపురంలో జరిగే 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్ బాల్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొంటారని ఉమ్మడి ప్రకాశం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్, సెక్రటరీలు వలేటి రవీంద్ర, టి.సుబ్బారావు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో మార్కాపురం పీడీ రమాదేవి, పీడీలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, కె.చిట్టెమ్మ, క్విజ్ కళాశాలకు చెందిన కోచ్ శివకుమారిలు పాల్గొన్నారు.



ఎంపికైన బాలుర జట్టు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడిని జాతీయ రహదారి అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

టంగుటూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సూరారెడ్డిపాలెం సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, జాతీయ రహదారి అంబులెన్సు సిబ్బంది తెలిపిన వివరాల మేరకు..కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన దాసరి వెంకటేశ్వర్లు సూరారెడ్డిపాలెం సమీపంలో రోడ్డు దాటుతుండగా ప్రమాదవశాత్తు కింద పడగా గుర్తుతెలియని వాహనం అతని కాలుపై నుంచి వెళ్లడంతో కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జాతీయ రహదారి అంబులెన్సులో జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

గడ్డిమందు తాగి వివాహిత ఆత్మహత్య

మద్రిపూడి: ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మద్రిపూడి మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని గుండ్లసముద్రం గ్రామానికి చెందిన మద్రిపూడి వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మకు నాలుగో సంతానమైన తిరుపతయ్యకు త్రిపురాంతకం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన కుమారి (39)తో సుమారు 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. భార్యభర్తలు హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో భార్యభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతున్నాయి. ఇద్దరి మధ్య సఖ్యత కుదరకపోవడంతో భార్య కుమారి తన అత్తగారి ఊరైన గుండ్లసముద్రం గ్రామంలోనే నివాసం ఉంటూ కూలి పని చేసుకుంటూ పిల్లలను పోషించుకుంటోంది. భర్త తిరుపతయ్య అప్పుడప్పుడూ వచ్చి వెళ్తుంటాడు. ఇటీవల హైదరాబాద్ నుంచి వచ్చిన తిరుపతయ్యను పెద్ద కుమారుడిని డిగ్రీ చదివించేందుకు భార్య కుమారి డబ్బులు అడిగింది. తోడపుట్టినవాళ్లను అడిగి తీసుకొస్తానని భర్త తిరుపతయ్య చెప్పడంతో.. పెళ్లయి ఇన్నాళ్లయినా.. ప్రతిదానికీ ఇంకా వాళ్లను అడగాలా అని కుమారి ప్రశ్నించడంతో ఇద్దరూ గొడవపడ్డారు. దీంతో మనస్తాపానికి గురైన కుమారి శనివారం రాత్రి ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన పొదిలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున కుమారి మరణించినట్లు బంధువులు తెలిపారు.